


# అనుక్షణం

## – సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గతసంచిక తరువాయి)

**"ఎందుకు ఇన్ని మాటలు అంటారు.** ఇంతకు ముందు నిరంజన్ గారు వాటా ఇస్తాం అన్నారు. అందుకని బ్యాంక్ నుండి డబ్బులు తీసుకు వచ్చారేమో. అలా అయితే చెప్పే వారు కదా. ఎందుకిలా చేస్తున్నారు అనుకున్నాను. అంతకు మించి పిచ్చి ఆలోచనలు నాకు రాలేదు. మీరు నమ్మినా, నమ్మకున్నా" అంది కళ్యాణి.

"ఆ డబ్బుయింకా బ్యాంక్ లోనే వుంది. అది ఎప్పుడయినా డ్రా చేసి నిరంజన్ గారికి ఇస్తాను. సరేనా?"

"మంచిదండి. ఇంక నేనూ ఏదీ మిమ్మల్ని నోరు తెరిచి అడగను. నన్ను క్షమించండి" అంది చేతులు జోడించి.

నిరంజన్ ఇంటికి చేరుకున్నాడు.

అప్పుడే వాళ్ల అమ్మాయి బయటకు వెళ్తూ అమ్మా నాన్నలకు 'బై' చెబుతోంది.

నిరంజన్ తన అమ్మాయిని, భార్యనూ పరిచయం చేశాడు. అమ్మాయి పేరు విజేత. శ్రీమతి స్వర్ణ. 'వెంకటాద్రి అంకుల్. ఇంతకు ముందు చెప్పాను' అన్నాడు. 'హలో అంకుల్' అంది చిరునవ్వుతో. చక్కగా వుంది. చూడగానే ఓ మంచి ఫీలింగ్ కలిగింది. 'బై అంకుల్' అని సెలవు తీసుకుంది.

తర్వాత ఆమె స్వయంగా కాఫీ తీసుకు వచ్చింది.

"మీ శ్రీమతిని, పిల్లల్ని తీసుకురండి" అంది స్వర్ణ.

"పిల్లలు బెంగళూరులో చదువుకుంటున్నారు. త్వరలో వస్తారు. ఓ రోజు తప్పకుండా వస్తాం" అన్నాడు వెంకటాద్రి. ఆమె తలూపి వెళ్లింది.

"ఏంటోయ్ అన్నీ రెండు వేల నోట్లు. ఈ మధ్య వీటిని తగ్గిస్తున్నారు. ఓ సారి బ్యాంకులో డిపాజిట్ చేస్తే వాటిని మళ్లీ బయటకు రానీయటం లేదు అంటున్నారు".

"ఇవయితే తీసుకురావటానికి ఈజీగా వుంటుంది. అయినా వీటిని రద్దు చేస్తారంటారా?"

''ఏమో... ఏమైనా జరగవచ్చు. ఇంతకు ముందు అలా జరుగుతుంది అనుకున్నామా?''

''అప్పట్లో మీకు ఏమైనా లాస్ అయిందా?''

''అదేం లేదు. నేను లిక్విడ్ క్యాష్ వుంచను. తర్వాత పేమెంట్స్ యిచ్చేటప్పుడు కొందరు పాత నోట్లు ఇవ్వబోయారు. మన లెక్క చెప్పగలిగే వరకు తీసుకున్నాం'' అన్నాడు.

అప్పుడు నేను బయలుదేరతాను అన్నాడు. ఈ సారి నిరంజన్ ఇంతకు ముందులా డబ్బు అందినట్లు రిసిప్ట్ గాని, డాక్యుమెంట్ గాని ఇవ్వలేదు. వెంకటాద్రి అడగలేదు. ముందు ఈ రోజుతో తన తల మీద పెద్ద బరువు తొలిగిపోయిందన్న సంతోషం మాత్రం కలిగింది.

ఆఫీస్ కి వెళ్తున్నప్పుడు అనుకున్నాడు.

''నిరంజన్ స్వర్ణగారికి ఈ విషయం చెబుతాడా?''

డబ్బు ఎలాంటి సమస్యలు తీసుకు వస్తుంది! మొదట్లో బోనస్ వచ్చినప్పుడు ఆనందంగా ఆ డబ్బులు తీసుకు వచ్చి కళ్యాణికి యిచ్చేవాడు. నీకు ఇష్టమైనది కొనుక్కో అనేవాడు. అప్పట్లో దానికీ సీలింగ్ వుండేది. ఈ రోజున తను అప్పటికప్పుడు ఎన్ని రకాలుగా మాటలు క్రియేట్ చేసుకున్నాడు. ఏ మాత్రం తొట్రుపడలేదు. పైగా నాకు ఇంకో ఫ్యామిలీ వుందనుకున్నావా అన్నాడు. ఇన్ని అబద్ధాలు ఎలా మాట్లాడగలిగాను. డబ్బే అన్ని దరిద్రపు కళల్ని నేర్పుతుందా అనుకున్నాడు.

పెద్ద వాళ్లు ఓ మాట చెబుతుంటారు. ఇంట్లో చెప్పకూడని విషయాలు కొన్ని వుంటాయి. అలా చెప్పటం వలన కొన్ని సమస్యలు వస్తాయి. కానీ నువ్వు యిచ్చే అప్పులు, అలాగే నువ్వు చేసే అప్పులు మాత్రం ఇంట్లో తెలియాలి. సడన్ గా ప్రమాదం లో ఎవరయినా చచ్చిపోవచ్చు. అలాంటి సమయంలో ఇంట్లో వారికి నీ ఆస్తుల గురించి, అప్పుల గురించి తెలియకపోతే నీతోనే అన్నీ అంతం అయిపోతాయి అని.

ఈ ఏభై లక్షల విషయంలో రూపాయి వెనక్కి రాకపోయినా నేను బాధపడను. ఇది నా డబ్బు కాదు. నా కష్టం కాదు. రోడ్డు పక్కన నాకు దొరికిన డబ్బుని నిరంజన్ కి యిచ్చాను. దాన్ని పదింతలు చేస్తాడా. ఒక్క లక్ష కూడా వెనక్కి ఇవ్వడా?

ఇది నాకు అనవసరం అనుకున్నాడు.

ఆనందరావు వాళ్లు అతని అత్తగారి విషయంలో ఇంకా ఓ నిర్ణయం తీసుకోక పోవటం వెంకటాద్రికి కాస్త ఆశ్చర్యం అనిపించింది. అది ఏ కేన్సర్ అనే విషయంలోనూ స్పష్టంగా చెప్పలేదు. బ్రెస్ట్ కేన్సర్ కాదు. అంత వరకు తెలుసు. బ్లడ్ కేన్సర్ అంత ప్రమాదకరం కాదు. అయినా ఆమె వయసు పెద్దది. ఎలాంటి వ్యాధినయినా భరించటం కష్టం. అయినా ఇలాంటి విషయాల్లో పదిమందిని అడుగుతారు.

కేన్సర్ కి ఎలాంటి కీమోలు లేకుండా కొన్ని రాష్ట్రాల్లో ఏవేవో మందులు ఇస్తున్నారని కూడా అంటున్నారు. అలాంటి వన్నీ ఫేస్ బుక్ లో పెడుతున్నారు. కొంతమంది మేం మూడు నాలుగు సంవత్సరాల నుండి సర్వైవ్ అవుతున్నాం. రెండు వారాల్లో ఈ లోకం నుండి వెళ్లిపోతాం అని డాక్టర్లు చెప్పారు. ఈ మందు మాకు పని చేసింది అని తమ వివరాలు చెబుతున్నారు. కొంత మందికి మందులు పని చేస్తాయి. అందరికీ అలా తగ్గితే ఇన్ని హాస్పటల్స్ నడవవు.

ఏది ఏమైనా ఇప్పటికీ కేన్సర్ కి మందులు లేవు. కొంత నివారణ వుంది. గొంతు కేన్సర్ లాంటివి వచ్చిన వారు బతుకుతున్నారు. వీలయినంత త్వరగా గుర్తిస్తే ఆ రోగంతో పోరాడటానికి అవకాశం వుంటుంది.

కళ్యాణి చెప్పిందాని ప్రకారం గుంటూరులోనే ఆమెకు ట్రీట్ మెంట్ ఇప్పించాలనుకుంటున్నారు. అక్కడ ఇల్లు వుంది. అక్కడకు వనిత వెళ్లి వుంటుంది. పిల్లల పరీక్షలు అయ్యాక నిర్ణయం తీసుకుంటారు. అలాగే ఆనందరావు తిరిగి డబ్బుల ప్రస్తావన తీసుకురాలేదు. పొలం అమ్మేదాం అనుకున్నారేమో. ముందు ఓ ఎకరం అమ్ముతారేమో అంది.

ఇదిలా వుంటే శివకృష్ణ నుండి ఫోన్ వచ్చింది. ఓ సారి వచ్చి నన్ను కలుస్తావా అని. వెంకటాద్రి వెళ్లాడు. శివలో మార్పు కనిపించింది. అతనికి పార్కిన్ సన్ వ్యాధి వచ్చిందంట. నడుస్తూ మొన్న కూలిపోయాడు. నడుముకి దెబ్బ తగిలింది అన్నారు. ఇప్పుడు బెడ్ మీద వున్నాడు. కనీసం అయిదారు నెలలు బెడ్ మీద వుండాలని చెప్పారు డాక్టర్లు. అతన్ని మంచం మీద చూడగానే వెంకటాద్రికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ఎందుకు అంత యిదయిపోతున్నావు వెంకూ... ఇవన్నీ జీవితంలో భాగం కదా!" అన్నాడు శివ.

"ఇంత చిన్న వయసులో ఇలా జరగటం ఏంటి! మన నడకలు... మన కబుర్లు... నువ్వు ఎంత భావుకతతో వున్నావు. ఎన్ని విషయాలు నీ నుండి నేను నేర్చుకున్నాను" అన్నాడు వెంకటాద్రి.

"ఇప్పుడు మంచం మీద వున్నాను కదా. ఇంకా భావుకత ఎక్కువయింది. అన్నీ ఆలోచనలే".

"అది సరే. నీకు డబ్బులు కావాలంటే ఎలాంటి మొహమాటం వద్దు శివా. రెండు చిట్లు పాడేద్దాం. అవి వాడుకో. తర్వాత చూసుకుందాం".

"ఆ మాట అన్నావు సంతోషం. నిజంగా అవసరం అయితే నిన్ను అడుగుతాను. నీ దగ్గర నాకు మొహమాటం ఎందుకు?"

"నీ చిన్న నాటి మిత్రుడికి ఈ విషయం చెప్పావా?"

"చెప్పకుండా ఎలా వుంటాను. నేను తొందర్లో వచ్చి నిన్ను కలుసుకుంటాను అన్నాడు. ఓ రకంగా నయం నేను మాట్లాడగలుగుతున్నాను. అదీ లేకపోతే యిబ్బందిగా వుండేది".

"అవును. అయినా తొందర్లో నువ్వు కోలుకుంటావాన్న నమ్మకం నాకు వుంది. మనం తిరిగి వాకింగ్ కి వెళ్తాం. మనల్ని రాళ్లు పిలుస్తుంటాయి. అవన్నీ శాపగ్రస్తులయిన దేవతలు అనుకునే వాళ్లం కదా!"

శివ చిన్నగా నవ్వాడు.

"దేవతలు కాదు. మనుషుల్లో కొందరు శాపగ్రస్తులుంటారు. ఆ రాళ్లు అక్కడ ఎక్కువ కాలం వుంటాయని అనుకోను. నువ్వో పని చెయ్యి వెంకటాద్రీ. ఇంత వరకు మనం ఆ ఫోటోలు తీయలేదు. అలాగే వీడియో తియ్యి. ఫోన్ లోనే. అది మనకు జ్ఞాపకంగా వుంటుంది. ఏమైనా నువ్వు ఇక్కడ నుండి వెళ్లిపోయావు. అది నాకు బాధగా వుంది. బతకలేక వలసలు వెళ్లటం వేరు. నువ్వు మంచి అవకాశాల దారిలో వున్నావు. ముందు ముందు నీ జీవితం ఇంకా మారుతుంది. అందుకు మాత్రం సంతోషంగా వుంటుంది" అన్నాడు శివ.

"తప్పకుండా శివా... నువ్వు చెప్పిన పని చేస్తాను".

"మన మధ్య ఆ రోజు ప్రేమ గురించి తీవ్ర చర్చ జరిగింది. అంతకు ముందు నీలో కనిపించని కొత్త వ్యక్తిని చూసాను. దానికి జవాబు చెబుతాను అన్నాను. అలాంటి అవకాశం రాలేదు. ఇప్పుడు బెడ్ మీద వున్నాను కదా ఆలోచిస్తాను. ఏమైనా 'ప్రేమ'ను మించింది లేదు. ఇప్పుడు నేను ప్రేమించిన నిన్నటి స్త్రీలలో ఎవరన్నా వచ్చి నా చిటికెన వేలు అందుకుంటే ఈ పార్కిన్ సన్ కాదు, ఏ వ్యాధీ నన్ను అడ్డుకోలేదు. అలా గాల్లో పరుగులు తీస్తాను" అన్నాడు శివ నవ్వుతూ.

"బాధల నుండి మనుషుల్ని బయటకు తేగలిగేది అందమైన ఊహలే" అన్నాడు వెంకటాద్రి.

చెన్నైలో సిక్ ఇండస్ట్రీని మొత్తం మీద తీసుకున్నారు. ఇంక అక్కడ తమ ప్రొడక్ట్ ని మొదలు పెట్టాలి. అందుకు తగ్గ మెషనరీని ఏర్పాటు చేయాలి. అక్కడ కూడా పాత ఫ్యాక్టరీకి చెందిన మెషనరీ వుంది. వాటిలో ఏ మేరకు ఉపయోగపడతాయి. చిన్న చిన్న మార్పులు చేయవచ్చా? వాటిని ఇంకెవరికన్నా అమ్మటమా అని నిరంజన్ ఆలోచిస్తున్నాడు. అలా అమ్మటం అంటే ఓ రకంగా స్క్రాప్ కింద అమ్మటమే. అలా హడావుడి మొదలయింది.

చెన్నైలోనూ ముందు ఫ్యాక్టరీ ఆవరణలో వున్న ఛాంబర్స్ ని చిన్న చిన్న మార్పులు చేయించారు. అక్కడే వుండటానికి తగ్గ ఏర్పాట్లు జరిగాయి. వంట చేసే ఓ వ్యక్తిని పెట్టాడు నిరంజన్. ఇదో కొత్త అనుభవంగా వుంది వెంకటాద్రికి.

ఆదిత్య, దివ్య ఇంటికి వచ్చారు. అప్పుడు అందరూ కలిసి నిరంజన్ ఇంటికి వెళ్లటం జరిగింది. మొదటి సారి పరిచయాలు జరిగాయి. విజేత, దివ్యను తన రూమ్ కి తీసుకు వెళ్లింది. అక్కడ నుంచి కబుర్లే కబుర్లు. అలాగే నిరంజన్ ఆదిత్యతో ప్రత్యేకంగా మాట్లాడాడు. ఇంజనీరింగ్ తర్వాత ఎం.ఎస్. కోసం ఎబ్రాడ్ వెళ్లాలని వుందా అని అడిగాడు. అలా అనేం లేదు. మంచి కాలేజ్ లో సీట్ వస్తే ఇక్కడే చదువుతాను అన్నాడు. అతను మెకానికల్ ఇంజనీరింగ్. తనకు ఐ.టి.కి చెందిన ఇంట్రెస్ట్ లు లేవు అని చెప్పాడు ఆదిత్య.

"అంటే ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని వుందా?"

"మనసులో అలాంటి ఆలోచన వుంది సర్. అయితే అందుకు అనుభవం కావాలి. అలాగే కేపిటల్ కావాలి. ఇవన్నీ నా దృష్టిలో వున్నాయి. ఇప్పుడు తొందర ఏముంది. ఎడ్యుకేషన్ పూర్తి కావాలి. నేను కూడా ఈ లోగా స్టడీ చేస్తున్నాను" అని చెప్పాడు.

దీప్తి సివిల్ ఇంజనీరింగ్ చేస్తోంది.

నిరంజన్ మదిలో ఆలోచనలు రూపు దిద్దుకుంటున్నాయి. ఆ రోజు అందరూ బాగా సరదాగా గడిపారు.

స్వర్ణ, నిరంజన్ మాట్లాడుకుంటున్నారు.

"వెంకటాద్రి గారి పిల్లలు పద్ధతిగా వున్నారు. దీప్తి అయితే విజేతకి బాగా నచ్చింది. చూడటానికి కూడా ముచ్చటగా వున్నారు" అంది స్వర్ణ.

"నేను ఆదిత్యతో మాట్లాడాను. వినయానికి వినయం వుంది. అంతకు మించిన చొరవ వుంది. అది వెంకులో తక్కువ. తను ఇప్పటి వరకు ఉన్న చోటు నుండి ఎదగాలని అనుకోలేదు. మెల్లగా మారుతున్నాడు. ఆదిత్య నా వరకు ఉపయోగపడతాడు అనిపించింది. నా ఆలోచనలు నాకున్నాయి" అన్నాడు నిరంజన్.

"అంటే... మన విజేతకి ఆ అబ్బాయి అయితే బాగుంటుంది అని మీకు అనిపిస్తోందా?"

"అలాంటి ఆలోచన లేదు. మన ఫ్యాక్టరీలు చూసుకునే నమ్మకమైన మనుషులు కావాలి. ఇలాంటి వారు దొరికితే నేను ఇంకా పెద్ద ప్లాన్స్ తయారు చేసుకోవచ్చు కదా".

"అతనింకా చదువుతున్నాడు కదా!"

"ఇంకో సంవత్సరంతో ఇంజనీరింగ్ పూర్తి అవుతుంది. ఎం.ఎస్. మరో రెండు సంవత్సరాలు. ఎంత సేపట్లో తిరిగి వస్తాయి స్వర్ణా" అన్నాడు.

"అది నిజమే లెండి" అంది స్వర్ణ.

ఆనందరావు వాళ్ల పెద్ద అమ్మాయిని వెంకటాద్రి వాళ్ల దగ్గర చదివించాలనుకున్నారు. అందుకు వెంకటాద్రి కూడా ఎలాంటి ఆలోచన లేకుండా ఒప్పుకున్నాడు. తను పది రోజులకి పైగా చెన్నైలో వుండాల్సి వస్తోంది. ఆ అమ్మాయి మేనత్తకి తోడుగా వుంటుంది అనుకున్నాడు.

నిరంజన్ ఆదిత్య విషయం మాట్లాడాడు.

"అతన్ని ఇంజనీరింగ్ అయిపోయాక మన ఫ్యాక్టరీస్ లోకి తీసుకోవాలనుంది వెంకూ... నీ అభిప్రాయం ఏమిటి?"

"వాడు ఎం.ఎస్. చేయాలనుకుంటున్నాడు".

"అది తప్పనిసరి అనుకుంటే సరే. చెన్నైలోనే మంచి కాలేజ్ చూస్తాను. నాకయితే చెన్నై యూనిట్ కి ఆదిత్యని ఇన్ ఛార్జ్ గా చేయాలని వుంది. ఎం.ఎస్. దేముంది. ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరం. అతనికి కూడా ఎప్పటికయినా ఇండస్ట్రీ పెట్టాలని వుంది అని నాతో అన్నాడు. అలాంటి దానికి నేను హెల్ప్ చేస్తాను. ఏదన్నా ఉద్యోగం చేసుకుందాం. దాంతో తృప్తి పడదాం అనుకుంటే అది వేరు".

"ఆదిత్యతో మాట్లాడాలి నిరంజన్ గారూ... "

"అసలేం మాట్లాడకుండా జరగవు కదా. నీ ముందు ప్రపోజల్ పెట్టాను. మీరు ఆలోచించుకోండి. అదలా వుంటే నేను మొదట్లో కొన్న త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్ వుంది. ఇప్పటి దాకా రెంట్ కి యిచ్చాం. మీరు అందులోకి షిఫ్ట్ అయితే బాగుంటుంది. మనకి దగ్గరగా వుంది. అది గేటెడ్ కమ్యూనిటీ".

"ఇప్పుడు అంత ఖరీదయిన చోటుకి మారటం అవసరం అంటారా?" అన్నాడు వెంకటాద్రి.

"ఎంత ఖరీదు. అయినా నువ్వు నిన్నటి వెంకటాద్రిలా మాట్లాడుతున్నావు. ఇప్పుడు నువ్వు నా భాగస్వామివి. ఇది మరిచిపోతున్నావు. మన ఆదాయాన్ని బట్టి మన లైఫ్ స్టయిల్ ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనను గాని, ఇది వరకటిలానే వుంటాను. నాకు పేదరికం ఆదర్శం అంటే ఎలా? ఈ రోజుల్లో గొప్ప గొప్ప కబుర్లు చెప్పే ఎవరయినా అలాంటివన్నీ ఇతరులకి అని నిర్ణయానికి ఎప్పుడో వచ్చారు".

వెంకటాద్రి తలాడించాడు.

"అందులోనూ మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు, అయిదు నిముషాల్లో కలుసుకోవచ్చు. ఈ షిఫ్టింగ్ నీకు అవసరం లేకపోయినా నాకు మాత్రం వుంది వెంకూ".

"అలాగే నిరంజన్ గారూ... మేం మారుతున్నాం".

"మీకు లెడ్ టీ.వీ. వుందా?"

"లేదు".

"సరే. ఇంట్లోకి అవసరమైన గాడ్జెట్స్ మన ఆఫీస్ తరపున తీసుకుంటాం. మీ దగ్గర పాత టీ.వీ., ఫ్రిజ్ లాంటివి వుంటే వాటిని ఏదో ఒకటి చేయండి. అలాగే వాషింగ్ మెషిన్ లాంటివి కూడా అన్నీ కొత్తగా వుండాలి" అన్నాడు నిరంజన్.

వెంకటాద్రి దేనికీ ఎదురు చెప్పాలనుకోలేదు. ఇప్పుడు తన చేతిలో ఏదీ లేదు. తన జీవితం మారిపోయింది. అప్పుడు అతనికి తన కొలీగ్ గుర్తు వచ్చాడు. వాళ్ల అబ్బాయిని ఇంజనీరింగ్ చదివించటానికి చాలా యిబ్బందులు పడ్డాడు. అప్పులు చేశాడు. వడ్డీలు కడుతున్నాడు. అలాంటి సమయంలో అబ్బాయి రెండో సంవత్సరంలో వుండగా చిన్న గుమాస్తా ఉద్యోగం ప్రభుత్వ సంస్థలో వచ్చింది. అందుకని చదువు మాన్పిస్తుంటే వద్దు అని వెంకటాద్రి బతిమాలాడు.

ఇంజనీరింగ్ పూర్తి అయితే మీ అబ్బాయి భవిష్యత్ చాలా బాగుంటుంది. కనీసం ఇంకో రెండు సంవత్సరాలు కష్టపడు అని ఒత్తిడి చేశాడు. ఈ ఉద్యోగం రాకపోతే అలా చేసేవాడిని. ఇక్కడ మెల్లగా ప్రమోషన్లు వస్తాయి. అయినా ఈ రోజు కొన్ని వేల మంది నిరుద్యోగ ఇంజనీర్లు ఖాళీగా వున్నారు అన్నాడు.

ఇప్పుడు తన పరిస్థితి అది కాదు. నిరంజన్ చెప్పేది బాగుంది. ఇది గుమస్థా ఉద్యోగం కాదు. అసలు ప్రగతి అనేది ఆదిత్య జీవితంలో ఇప్పటి నుంచి మొదలవుతుంది. అయినా వాడితో మాట్లాడాలి. తన కోలీగ్ తన అబ్బాయితో ఏం మాట్లాడాడో, ఎలా కన్విన్స్ చేశాడో తెలియదు. తను మాత్రం అలాంటి పని చేయడు. మనకు అప్పులు లేవు. నిన్ను చదివించటానికి ఎలాంటి ఆర్థిక యిబ్బందులు లేవు. అందుకని నిర్ణయం నువ్వు తీసుకో అని మాత్రం చెబుతాడు.

వారం పది రోజుల్లోనే ఇల్లు మారారు. అప్పుడు తిరిగి ఆ పాత సూట్ కేస్ సమస్య వచ్చింది. అంతకు ముందు డబ్బులు దొరికిన బ్యాగ్ ని ఎక్కడయినా పారేయాలనుకున్నాడు. అది ఎవరికన్నా కనిపిస్తే అందులో వెతుకుతారు. ముందు రకరకాల అనుమానాలు మొదలవుతాయి. హత్య చేశాక అందుకు వాడిన ఆయుధాలను మాయం చేయటానికి నానా తిప్పలు పడుతుంటారు. ఒక్కోసారి అవే హంతకులను పట్టిస్తాయి. చాలా రకాలుగా ఆలోచించాక ఆ బ్యాగ్ ని ముక్కలు ముక్కలుగా కత్తిరించాడు. అవన్నీ కూడా ఒకే రోజు, ఒకే సారి, ఒకే చోట పారేయలేదు. రకరకాల ప్రాంతాల్లో, మురుగు కాల్వల్లో వాటిని పారేశాడు. అప్పటికి గాని గుండె దడ తగ్గలేదు.

ఇంకా ఆ డబ్బుకి చెందిన జ్ఞాపకం ఆ పాత సూట్ కేసు. ఈ సారి దాన్ని పనిమనిషికి ఇప్పించాడు.

మనుషులు తమ గతంలో చేసిన తప్పుల్ని మరిచిపోవటానికి ప్రయత్నం చేస్తుంటారు. అలాగే తమ గతం తెలిసిన వారు తమ ఎదురుగా వుంటే, తమ గతంలో మరకలు వుంటే, అలాంటి వ్యక్తుల్ని దూరంగా వుంచుతారు. లేదా తాము దూరంగా వెళ్తారు.

ఇప్పుడు సూట్ కేస్ సమస్య కూడా తీరిపోయింది.

వెళ్లే ముందు శివని కలిశాడు. అతను ఇంకా బెడ్ మీద వున్నాడు. ''మరింత దూరంగా వెళ్తున్నావు వెంకటాద్రీ'' అన్నాడు.

వెంకటాద్రి ఆదిత్య విషయం కళ్యాణికి చెప్పటం జరిగింది. అంతా విన్నాక ''పైకి వింటుంటే బాగానే వుంది అనిపిస్తోంది. అయితే దాని వల్ల మంచి జరుగుతుందా అనేది వుంది. కాకపోతే చెడు జరగకపోవచ్చు. ఆదిత్య ఎక్కడయినా ఉద్యోగం చేయాలి. ఇప్పటి వరకు జరిగింది చూస్తుంటే నిరంజన్ గారు మనతో మంచిగా వున్నారు. ఒక్కో సౌకర్యం కలిగిస్తున్నారు. ఇంక నిర్ణయం తీసుకోవాల్సింది మన ఆదిత్య''.

''అందుకే వాడితో మాట్లాడదామనుకుంటున్నాను''.

''ఇంకో సంవత్సరం వుంది కదా. ఇప్పుడే మాట్లాడాలా?''

''ముందు మాట్లాడటం మంచిది. ఈ లోగా వాడు తన తర్వాతి చదువుల గురించి ప్లాన్ చేసుకుంటాడు. అప్పటికప్పుడు చెబితే నిరాశపడొచ్చు. మనం ఇష్టపడుతున్నాం అనుకోవచ్చు. అయితే నేను వాడితో మాట్లాడే ముందు ఇందులో మా ఇష్టాఇష్టాలు లేవని చెబుతాను''.

''మీ ఇష్టం వచ్చినట్లు చేయండి'' అంది కళ్యాణి.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS